# క్రైం కౌంటర్

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలుగు దినపత్రిక

సంపుటి : 03 సంచిక : 102 మంగళవారం 13-01-2026 పేజీలు : 4 వెల : 4/-

Website:- https://www.crimecounter.in/



క్రైం కౌంటర్ News

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలంగాణ సూర్యాపేట జిల్లా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు

రిపోర్టర్లు కావలెను

- జిల్లా బ్యూరోలు
- నియోజక వర్గ ఇన్చార్జీలు

Contact No: 98497 07349


## పచ్చని పైరును దున్ని నాశనం చేశారని రైతుల గోస.



- తమకు న్యాయం చేయాలని మల్లు రైతులు బిక్షమా రెడ్డి, వెంకట్ రెడ్డి లు పురుగుమందు డబ్బాలతో పొలం వద్ద ఆందోళన.
- వారసత్వంగా తమకు వచ్చిన భూమిని మల్లు వీరారెడ్డి కుటుంబీకులు అడ్డుకుంటున్నారని ఆరోపణ.
- ముడుపులు తీసుకొని అధికారులు తమకు న్యాయం చేయడం లేదని ఇక చావే శరణ్యం అంటూ పత్రికల ముందు గోడు వెల్లబోసుకున్న రైతులు.
- ఆర్ఐ ఫీల్డ్ రిపోర్ట్ ను ఎమ్మార్వో ముడుపులు తీసుకొని మార్చారని ఆరోపణ.

క్రైం కౌంటర్ న్యూస్ కోదాడ, జనవరి 11( గురునాథం జిల్లా బ్యూరో )

సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గం కోదాడ మున్సిపల్ పరిధిలో జరిగిన సంఘటన. వారసత్వంగా వచ్చిన తమ పొలంలో సాగు చేసిన పచ్చని పసి పైరును రాత్రికి రాత్రే దున్ని నాశనం చేశారని కోదాడ పరిధిలోని శ్రీరంగపురానికి చెందిన రైతులు మల్లు బిక్షా రెడ్డి, వెంకటరెడ్డిలు కుటుంబ సభ్యులతో కలిసి పురుగుమందు డబ్బాలతో పొలం వద్ద ఆందోళనకు దిగారు. వారసత్వంగా వచ్చిన తమ భూమిని మల్లు వీరారెడ్డి కుమారులు మల్లు వెంకటరెడ్డి, సైదిరెడ్డి,ఏసి రెడ్డిలు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. గత కొంతకాలంగా ఈ వివాదం జరుగుతుందని ఇదే విషయాన్ని కోదాడ ఎమ్మార్వో దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇటీవల రెవెన్యూ ఇన్స్పెక్టర్ సర్వే చేసి ఆ 30 కుంటల భూమి తమది అని రిపోర్టు కూడా ఇచ్చారన్నారు. కాగా కొందరి ఒత్తిడి ప్రలోభాలకు లొంగి ఎమ్మార్వో ఆర్ఐ రాసిన రిపోర్టును మార్చి ఈ భూమి తమకు చెందకుండా నివేదికల రూపొందించారని కన్నీరు మున్నిరయ్యారు. ఈ విషయం కలెక్టర్ కు కూడా ఫిర్యాదు చేశానన్నారు. ఇటీవల కాలంలో తమపై దాడులు కూడా జరగడంతో పోలీసులకు మరణ వాంగ్మూలం తో కూడా ఆశ్రయించామని అయినప్పటికీ పోలీసు అధికారులు సైతం తమకు న్యాయం చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. తమపై దాడి చేసి ఆక్రమించుకోవాలని చూస్తున్న వారిపై అధికారులు నాయకుల ఒత్తిడితో ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని వాపోయారు. భూ రికార్డుల ప్రకారం గతంలో వారి బాగా పంపిణీ వచ్చిన భూమి ఎన్ఎస్పీ కాల్వ కింద పోయిందని వీరు అదే పోయిన భూమిని అధికారులకు ముడుపులు అప్పగించి రికార్డు లోకి ఎక్కించుకుని తమ భూమి పైకి దౌర్జన్యంగా వస్తున్నారని కలెక్టర్ జోక్యం చూసుకొని విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో కుటుంబ సభ్యులతో కలిసి కోదాడ ఎమ్మార్వో కార్యాలయం ముందు పురుగుమందు దాగి ఆత్మహత్యలు చేసుకోవడం తప్ప మరో దారి లేదని వాపోయారు.

## గురుకుల ప్రవేశాలకు ధరఖాస్తు చేసుకోవాలి



జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

క్రైమ్ కౌంటర్ న్యూస్ సూర్యాపేట జనవరి 11

2026ఉ27 విద్యాసంవత్స రానికి గాను తెలంగాణ రాష్ట్రంలోని అన్ని గురుకు లాలలో ప్రవేశాలకు అర్హు లైన ఎస్సీ,ఎస్టీ, బిసి జనరల్ విద్యార్థులు ఈ నెల 21వ తేదీలోగా ధరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు..

5వ తరగతి ప్రవేశ పరీక్షతోపాటు,6,7, 8,9 తరగతులలో మిగిలిన సీట్లకు కూడా భర్తీకి అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 22న ఉదయం 11 గంటలనుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించను న్నట్లు తెలిపారు.దరఖాస్తు ను https://tgcet.cgg.gov.in, https://tgswreis.telangana.gov.in,https://tgtwgurukulam.telangana.gov.in. ఆన్ లైన్ లో సమర్పించాలని దరఖాస్తు చేసుకునేందుకు కులం, ఆదాయం, ఆధార్, బర్త్ సర్టిపికేట్,పాస్ ఫొటో వివరాలు సమర్పించాల్సి ఉంటుందని విద్యార్థులు అందరు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు

## చింతలపాలెంలో జిల్లాస్థాయి సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం..



క్రైమ్ కౌంటర్ న్యూస్ హుజూర్ నగర్ (చింతలపాలెం) జనవరి 11

చింతలపాలెం మండల కేంద్రంలో ఈగల్స్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్సై సందీప్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా చింతలపాలెం గ్రామ సర్పంచ్ కందుల రామకోటిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నందిరెడ్డి ఇంద్రారెడ్డి, బిఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షులు మోర్తాల వెంకటరెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్తేల నారాయణరెడ్డి, పిక్లనాయక్ తాండ సర్పంచ్ లకావత్ సైదులు, యరబోలు నాని, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు చింతిరాల బాలచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, క్రీడల ద్వారా యువతలో క్రమశిక్షణ, ఐక్యత పెరుగుతాయని, ఇలాంటి టోర్నమెంట్లు గ్రామీణ ప్రతిభను వెలికి తీయడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్రీడాభిమానులు, యువకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చిలుకూరులో ఘనంగా గోదాదేవి పూజలు



క్రైమ్ కౌంటర్ న్యూస్ చిలుకూరు జనవరి 11 నియోజకవర్గ ప్రతినిధి

సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గ చిలుకూరు మండల కేంద్రంలోని చిలుకూరు చెన్నకేశవ స్వామి దేవాలయంలో గోదాదేవి కళ్యాణాన్ని పురస్కరించుకొన మహిళా భక్తులు కుంకుమార్చన, గిన్నెల పాశం కార్యక్రమాలను, అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం వెంకటేశ్వర స్వామి భక్తులకు, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో చిలుకూరు సర్పంచ్ కొల్లు పుల్లమ్మ, మరియు మహిళలు, భక్తులు, తదితరులు, పాల్గొన్నారు.



## శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో ఘనంగా గోదాదేవి పూజలు





క్రైమ్ కౌంటర్ న్యూస్ చిలుకూరు జనవరి 12 నియోజకవర్గ ప్రతినిధి సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గ చిలుకూరు మండల కేంద్రంలోని చిలుకూరు శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం లో ధనుర్మాసం తిరుప్పావై పాశురాలు విన్నపం మేరకు,ఈరోజు గోదాదేవి అమ్మవారి కి చిలుకూరు మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కి సారె సమర్పించినారు. ఒడి నింపుట కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇట్టి కార్యక్రమం లో ఆలయం అర్చకులు రజనీ కాంత్ ఆచార్య, అమ్మ వారిని ప్రత్యేకంగా అలంకరించి, కుంకుమ పూజలు నిర్వహించారు.ఆ తదుపరి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మా వారికి సారె సమర్పించారు.తదుపరి ఆలయం అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఇట్టి కార్యక్రమం లో ఆలయం ఛైర్మన్ శ్రీ కొడారు వెంకటేశ్వర్లు, కట్టెకోల చంద్రయ్య, శ్రీనివాస్ రావు, మరియు ఈ సారె సమర్పన ఏర్పాటు చేసిన వారు , మమత, రోజా భవానీ, కొడారు లక్ష్మీ, అనురాధ, లావణ్య, నర్మదా, లక్ష్మీ, మాధవీలత, పుల్లమ్మ, లక్ష్మి, నీరజ కుమారి, గ్రామ నూతన సర్పంచ్ శ్రీమతి కొల్లు పుల్లమ్మ, అనూష, తదితరులు మహిళా భక్తులు పాల్గొన్నారు. ఆలయం అర్చకులు వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి గోదాదేవి అమ్మవారి ఆశీస్సులు అందజేసారు.

## దొంగతనాల నివారణ కోసం పోలీసు విన్యూత కార్యక్రమం.



- మైక్ ద్వారా ప్రజలకు అవగాహన.
- మద్యంమత్తులో వాహనాలు నడపవద్దు.
- పంతంగుల అటకోసం సంప్రదాయ దారం వాడాలి.
- చైనామంజా పై పూర్తి నిషేధం.
- ఎస్ఐ మోహన్ బాబు

క్రైమ్ కౌంటర్ న్యూస్ హుజూర్ నగర్ జనవరి 12హుజూర్నగర్ పట్టణం మరియు మండల గ్రామాలలో హుజూర్నగర్ పోలీసుల ఆధ్వర్యంలో అటోకు మైక్ అమర్చి పండుగల సందర్భంగా దొంగతనాల నివారణ, రోడ్డు ప్రమాదాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. హుజూర్నగర్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వినూత్న కార్యక్రమం చేపట్టినట్లు ఎస్ఐ మోహన్ బాబు తెలిపినారు. సంక్రాంతి పండుగా సందర్భంగా ఇండ్లకు తాళం పెట్టీ ఎక్కువరోజులు సొంత ఊర్లు, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి ఆటో పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నాం అన్నారు. పండుగకు ఊరు వెళ్లేవారు విలువైన బంగారం, వెండి, నగదు లాంటి వాటిని ఇంట్లో ఉంచకూడదని బ్యాంకు లాఖరులో దాచుకోవడం మంచిది అని చెప్పారు. ఊరు వెళ్లే ముందు పక్క ఇంటి వారికి సమాచారం ఇవ్వాలని అలాగే స్థానిక పోలీస్ స్టేషన్ లో తెలియజేయాలని సూచించారు, ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనబడితే వెంటనే డయల్ 100 కు సమాచారం ఇవ్వాలి, పతంగులు ఎగరవేసేవారు చైనీస్ మాంజాను వాడకూడదని తెలియజేశారు, చైనా మాంజా విక్రయించిన, వాడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించాలని మద్యం మత్తులో వాహనాలు నడపవద్దు, అతివేగంగా వాహనాలు నడపవద్దు అన్నారు. పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దు అని సూచించారు. పండుగను సురక్షితంగా జరుపుకోవాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా చూసుకోవాలని ప్రజలకు తెలిపారు , ప్రజల రక్షణే పోలీసు ధ్యేయమని ప్రజలకు తెలిపారు.

## సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా లింగయ్య

క్రైమ్ కౌంటర్ న్యూస్ చిలుకూరు జనవరి 12 నియోజకవర్గ ప్రతినిధి



సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గ చిలుకూరు మండల కేంద్రంలోని సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడి ఎన్నికను చిలుకూరు ఎంపీడీవో కార్యాలయంలో మొత్తం 17 గ్రామాల సర్పంచులు సమావేశమై ఫోరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా పోలేని గూడెం సర్పంచ్ బాదే లింగయ్య ను ఎన్నుకున్నారు. అదేవిధంగా ఉపాధ్యక్షుడిగా బానోత్ కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా లావూరి రమాదేవి, గౌరవ అధ్యక్షులుగా నారాయణపురం సర్పంచును ఎంపిక చేశారు. గ్రామాల అభివృద్ధి కోసం మనమందరం కలిసి సమిష్టిగా కృషి చేస్తామని వారు సభ ముఖంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిలుకూరు మండలం కేంద్రంలో గెలిచినటువంటి సర్పంచులందరూ పాల్గొనడం జరిగింది.

## మాజీ సర్పంచ్ అక్కులు జీవితం ఆదర్శ ప్రాయం



సిపిఎం మండల కార్యదర్శి అనంత ప్రకాష్క్రైమ్ కౌంటర్ న్యూస్ పాలకవీడు జనవరి 12సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం గుడుగుంట్ల పాలెం గ్రామంలో సోమవారం మాజీ సర్పంచ్ సిపిఎం సీనియర్ నాయకులు గుడ్డేటి అక్కులు దశదినకర్మ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కందగట్ల అనంత ప్రకాష్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొదమగుళ్ల నగేష్, నాయకులు అభిమానులు వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు,ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కందగట్ల అనంత ప్రకాష్ జిల్లా కమిటీ సభ్యులు నగేష్ మాట్లాడుతూ అక్కులు జీవితం ఆదర్శప్రాయమని వారు కొనియాడారు సిపిఎం పార్టీ నాయకునిగా గ్రామ సర్పంచిగా ప్రజలకు ఎనలేని సేవలు చేశారని సర్పంచ్ గా ఉన్న కాలంలో గ్రామ అభివృద్ధికి తోడ్పడ్డారని వారు అన్నారు ఎర్రజెండా నీడన నీతిగా నిజాయితీగా పనిచేసిన వ్యక్తి అని తెలిపారు ప్రజా సమస్యల పరిష్కారం పట్ల ఆయన చిత్తశుద్ధిని మరువలేనిది అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నగేష్ సిపిఎం మండల కమిటీ సభ్యులు పగడాల మల్లేష్ గుర్రం ధనమూర్తి ఎర్రెడ్ల మల్లారెడ్డి దిద్దుకుంట్ల పురుషోత్తం రెడ్డి దొరికొండ వెంకటేశ్వర్లు దిద్దకుంట్ల రాంరెడ్డి, ఆర్లపూడి వీరభద్రం, యేసు రత్నం పాతూరు శ్రీనివాసరావు కుంకు తిరుపతయ్య మోదాల నరసింహ మోదాల నాగరాజు దామినేని బాబు, అక్కులు కుమారులు నందయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు

# ఖమ్మంలో జరిగే సిపిఐ బహిరంగ సభను విజయవంతం చేయాలి



- సిపిఐ 100 సంవత్సరాల ముగింపు సభను జయప్రదం చేయాలి
- చిలుకూరులో దొడ్డ నర్సయ్య భవన్ లో వాల్ పోస్టర్ ఆవిష్కరణ

క్రైమ్ కౌంటర్ న్యూస్ చిలుకూరు జనవరి 12 నియోజకవర్గ ప్రతినిధి

సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గ చిలుకూరు మండల కేంద్రంలోని దొడ్డ నర్సయ్య భవన్లో ఈరోజు జరిగినటువంటి భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాల అఖిల భారత స్థాయి ముగింపు ఉత్సవాలను తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా కేంద్రంలో ఈనెల 18వ తేదీన లక్షలాది మందితో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఐ నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం చిలుకూరు మండల కేంద్రంలోని దొడ్డ నరసయ్య గారి భవన్ సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన సిపిఐ చిలుకూరు గ్రామ శాఖల కౌన్సిల్ సమావేశం చేపూరి కొండలు అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) భారత గడ్డపై వందేళ్లు పూర్తి చేసుకోవడం జరుగుతుంది.భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని మొట్టమొదటిగా గర్జించిన ఏకైక పార్టీ సిపిఐ. బ్రిటిష్ వారి నుండి మన దేశ విముక్తి కొరకు రాజీలేని పోరాటాలు నిర్వహించిన ఘనమైన చరిత్ర సిపిఐది. భూమికోసం భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం, నిరంకుశ నిజాంను గద్దె దించడానికి జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగు వేల మంది ప్రాణ త్యాగాలతో, 10 లక్షల ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీది. తెలంగాణ రాష్ట్ర సాధన కొరకు మొట్టమొదటిసారిగా పార్లమెంటులో గర్జించి ప్రత్యేక తెలంగాణ రాష్టం కావాలని నినదించి ప్రత్యేక రాష్టం సాధించడంలో కీలక పాత్ర పోషించిన పోరాటాల పార్టీ సిపిఐ అని కొనియాడారు. ఈ వంద సంవత్సరాల కాలంలో ఎన్నో పోరాటాలు,ఎన్నో త్యాగాలు ఎంతోమంది అమరవీరుల రక్త తరపనతో ఎన్నో విజయాలు సాధించి భారత దేశ రాజకీయ చరిత్రలో సిపిఐ తనకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్నది. ఇటువంటి చరిత్ర కలిగినటువంటి సిపిఐ పార్టీ జనవరి 18న ఖమ్మం నగరంలో భారీ ప్రదర్శన, జన సేవాదళ్ కవాతు, డిగ్రీ కళాశాల గ్రౌండ్లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ బహిరంగ సభకు దేశ నలుమూలల నుంచి లక్షలాదిమంది సిపిఐ పార్టీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. 40దేశాల నుంచి కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధులు పాల్గొంటున్నటువంటి ఈ బహిరంగ సభకు చిలుకూరు గ్రామం నుంచి సిపిఐ కార్యకర్తలు నాయకులు మహిళలు యువకులు పెద్ద ఎత్తున కార్యకర్తల తరలివెళ్లి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఇట్టి బహిరంగ సభకు సంబంధించిన వాల్ పోస్టర్ను ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో సిపిఐ చిలుకూరు గ్రామ శాఖల కార్యదర్శులు షేక్ సాహెబ్ అలీ, చిలువేరు ఆంజనేయులు, చేపూరి కొండలు, పిల్లుట్ల కనకయ్య, కస్తూరి సైదులు, దొడ్డ నాగేశ్వరరావు, కొడారు శ్రీను, గుజ్జుల ముత్తారెడ్డి, పోలె బోయిన గంగాధర్, మల్లెపుంగు సూరిబాబు, పిల్లుట్ల కనకారావు, అనంతుల రాము, మాదాసు ప్రశాంత్, మాధవరపు కొండలు, కాటూరి అంకులు, కందుకూరి కృష్ణమూర్తి, తిరుమల్ రావు, కొండ రాములు, వీరస్వామి, దసరాద వీరబాబు, మౌలానా తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టులో అనూహ్య పరిణామం..




పోలవరం– నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టు వివాదంపై సుప్రీం కోర్టులో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. సుప్రీంలో దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. రిట్ పిటిషన్‌కు బదులుగా సివిల్ సూట్ రూపంలో మళ్లీ దాఖలు చేయాలని సీజేఐ సూచించడంతో.. తెలంగాణ సర్కార్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ అనుమతులు లేకుండానే నీటిని అధికంగా వాడుకుంటోందని ఆయన ఆరోపించారు. కాగా, ఈ ప్రాజెక్టుపై సివిల్ సూట్ రూపంలో తెలంగాణ పోరాటం కొనసాగించే అవకాశాలు ఉన్నాయి. ఏపీలో నిర్మించ తలపెట్టిన పోలవరం– నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై వివాదం నెలకొన్న సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి సుప్రీంకోర్టులో ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. అయితే సోమవారం (జనవరి 12) అత్యున్నత ధర్మాసనంలో పిటిషన్ విచారణ సందర్భంగా అనూహ్యం పరిణామం చోటుచేసుకుంది. పోలవరం– నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అధికారికంగా వెల్లడించారు. పిటిషన్‌ను తెలంగాణ ప్రభుత్వం ఉపసంహరించుకున్న నేపథ్యంలో.. కేసును డిస్పోజ్ ఆఫ్ చేసినట్లుగా అత్యున్నత ధర్మాసనం పేర్కొంది. పోలవరం– నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరిగింది. తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. అయితే రిట్ పిటిషన్‌లా కాకుండా.. సివిల్ సూట్ రూపంలో మళ్లీ పిటిషన్ దాఖలు చేయాలని సీజేఐ సూచించారని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. అందుకే పిటిషన్‌ను ఉపసంహరించుకున్నట్లు తెలిపారు. దీంతో సివిల్ సూట్ రూపంలో మరోసారి తెలంగాణ ఈ అంశంపై పిటిషన్ దాఖలు చేసే అవకాశాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించాలనుకుంటున్న ప్రాజెక్టుపై తాము అభ్యంతరాలతో రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. తెలంగాణ ప్రభుత్వం తరఫున బలంగా వాదనలు వినిపించామన్నారు. అయితే కేటాయింపుల కంటే ఎక్కువ నీళ్లు వాడుకోవద్దనేది ఇందులో ముఖ్యమైన అంశమని తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వంపై విమర్శలు చేశారు ఉత్తమ్ కుమార్ రెడ్డి.ఏపీ అనేకసార్లు ఉల్లంఘనలకు పాల్పడిందని ఆరోపించారు ఉత్తమ్ కుమార్ రెడ్డి. వాటిని కూడా అత్యున్నత న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చామన్నారు. అంతేకాకుండా ఏపీ స్టాప్ వర్క్ ఆర్డర్‌ను అమలు చేయడం లేదని కోర్టుకు నివేదించినట్లు వెల్లడించారు. ఏపీకి కేటాయించింది 484.5 టీఎంసీలేనని.. కానీ దానికి మించి ఉపయోగించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రయత్నాలు చేస్తోందన్నారు. గోదావరి, కృష్ణా బోర్డులు, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు లేకుండానే ఏపీ సర్కార్ ప్రయత్నాలు మొదలుపెట్టిందని కోర్టుకు చెప్పినట్లు వెల్లడించారు.ఏంటీ వివాదం?ఏపీలో పోలవరం ప్రాజెక్టు నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. అయితే పోలవరం నుంచి నల్లమల సాగర్‌కు నీటిని తరలించే లింక్ ప్రాజెక్టు నిర్మించేందుకు ఏపీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. అందుకు తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. అందులో భాగంగానే సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది.

# ఈ ప్రాంతంలోనే, మృత్యు మలుపులకు చెక్




మెదక్ – హైదరాబాద్ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నర్సాపూర్ – గుమ్మడిదల అటవీ మార్గంలో 10 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. పర్యావరణానికి హాని కలగకుండా, ప్రయాణ సమయాన్ని తగ్గించేలా ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు.మెదక్ – హైదరాబాద్ జాతీయ రహదారి 765–డీపై ప్రయాణం త్వరలో మరింత సురక్షితం కాబోతోంది. నర్సాపూర్ నుంచి సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల వరకు ఉన్న దట్టమైన అటవీ మార్గంలో తరచూ జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం భారీ ప్రణాళికను సిద్ధం చేస్తోంది. అడవులకు నష్టం కలగకుండా, ప్రయాణ సమయాన్ని తగ్గించేలా 10 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించేందుకు అధికారులు రెండు రకాల ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ఈ మార్గంలో రోడ్డు విస్తరణకు అటవీ శాఖ అనుమతులు రావడం అతిపెద్ద సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో అధికారులు రెండు మార్గాలను పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న రహదారిని ఇరువైపులా 100 అడుగుల మేర విస్తరించి, మధ్యలో విభాగిని డివైడర్ నిర్మించటం ఒకటైతే.. అడవిలోని చెట్లను నరకాల్సిన అవసరం లేకుండా ఆకాశ మార్గాన పిల్లర్లపై ఎలివేటెడ్ కారిడార్ నిర్మించడం మరొకటి.స్థానిక ఎంపీ రఘునందన్‌రావు రెండో ప్రతిపాదన ఎలివేటెడ్ కారిడార్ వైపే మొగ్గు చూపుతున్నారు. దీనివల్ల పర్యావరణానికి మేలు జరగడమే కాకుండా, ప్రమాదాలు పూర్తిగా తగ్గుతాయని భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు కిలోమీటరుకు సుమారు రూ.150 కోట్లు, మొత్తం మీద రూ.1,000 నుంచి 1,500 కోట్ల వరకు వ్యయం అవుతుందని ప్రాథమిక అంచనా. మేడ్చల్ జిల్లా గండిమైసమ్మ నుంచి రాంపూర్ వరకు ఉన్న 62.92 కి.మీ. జాతీయ రహదారిలో గుమ్మడిదల వరకు మాత్రమే నాలుగు వరుసల రహదారి ఉంది. అక్కడి నుంచి నర్సాపూర్ వరకు ఉన్న మార్గం కేవలం రెండు వరుసలకే పరిమితమైంది. ఈ అటవీ మార్గంలో సుమారు 25 ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. డివైడర్ లేకపోవడంతో వేగంగా వచ్చే వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడం లేదా మలుపుల వద్ద అదుపు తప్పి లోయల్లో పడిపోవడం వంటి సంఘటనలు నిత్యకృత్యమయ్యాయి. ఈ రహదారి నిర్మాణం కూడా కొన్నిచోట్ల అస్తవ్యస్తంగా ఉండటంతో వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. ఈ సమస్య తీవ్రతను కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లినట్లు ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. 'తరచూ జరుగుతున్న ప్రమాదాల్లో ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. పర్యావరణానికి ఇబ్బంది లేకుండా ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని కోరాం.' అని ఆయన వెల్లడించారు. దీనికి సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక తయారీకి కన్సల్టెన్సీ నుంచి బిడ్‌లను కూడా ఆహ్వానించారు. ఈ కారిడార్ పూర్తయితే హైదరాబాద్ – మెదక్ మధ్య ప్రయాణం సాఫీగా సాగడమే కాకుండా, పర్యాటక పరంగానూ ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది.

# తెలంగాణలోని 33 జిల్లాల్లో ఆ జిల్లా రద్దు..?





తెలంగాణలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ అంశం రాజకీయంగా వేడెక్కుతోంది. గతంలో జరిగిన అశాస్త్రీయ విభజన వల్ల పరిపాలనా సమస్యలు తలెత్తుతున్నాయని, అందుకే రిటైర్డ్ అధికారుల కమిటీతో జిల్లాల సరిహద్దులను సవరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ క్రమంలో జనగామ జిల్లా రద్దు కాబోతోందని వస్తున్న వార్తలను ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఖండించారు. జనగామ జిల్లాను కాపాడుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రి పొంగులేటి అసెంబ్లీలో ప్రస్తావించినప్పటి నుంచే ఈ చర్చ ఊపందుకుంది. కేవలం రాజకీయాల కోసం కాకుండా, ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా పరిపాలనా సౌలభ్యం కోసం మార్పులు చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. తెలంగాణలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ అంశం మళ్లీ తెరపైకి రావడంతో రాజకీయంగా పెను దుమారం రేగుతోంది. ముఖ్యంగా జనగామ జిల్లా మనుగడపై వస్తున్న వార్తలు స్థానికంగా ఆందోళన కలిగిస్తున్నాయి. పరిపాలనా సౌలభ్యం కోసం శాస్త్రీయ పద్ధతిలో జిల్లాల సరిహద్దులను సవరించాలని ప్రభుత్వం భావిస్తుండటమే ఈ చర్చకు ప్రధాన కారణం. రాష్టంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ అవసరమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించినప్పటి నుంచి ఈ అంశంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిలో భాగంగానే.. జనగామ జిల్లాను రద్దు చేస్తున్నారంటూ ప్రచారం జరుగుతోంది. దీనిపై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పందిస్తూ, జనగామ జిల్లా విషయంలో ప్రజలు ఆందోళన చెందవద్దని కోరారు. రాజకీయ లబ్ధి కోసమే కొందరు అపోహలు సృష్టిస్తున్నారని.. జిల్లాను కాపాడుకుంటామని హామీ ఇచ్చారు.గత ప్రభుత్వ హయాంలో జరిగిన జిల్లాల విభజనలో అనేక లోపాలు ఉన్నాయని ప్రస్తుత ప్రభుత్వం భావిస్తోంది. గతంలో కేవలం నాలుగు లేదా ఐదు మండలాలతో కొన్ని జిల్లాలను ఏర్పాటు చేశారు. దీనివల్ల పరిపాలన పరంగా అధికారుల కొరత, జోనల్ వ్యవస్థలో సమస్యలు, స్థానికులకు దూరభారం వంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తాజాగా సీఎం రేవంత్ రెడ్డి కూడా ఈ అంశాన్ని నొక్కి చెప్పారు. జిల్లాల సరిహద్దుల సవరణపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం త్వరలో రిటైర్డ్ అధికారులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని నియమించనుంది. ఈ కమిటీ ప్రజల అభ్యంతరాలను, భౌగోళిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని సమగ్ర నివేదిక సమర్పిస్తుంది. జనగామ జిల్లాను రద్దు చేస్తారని వస్తున్న వార్తల్లో నిజం లేదని, అయితే మండలాల సర్దుబాటు జరిగే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి.హన్మకొండ లేదా యాదాద్రి జిల్లాల సరిహద్దుల్లో ఉన్న మండలాల విషయంలో ప్రజల విజ్ఞప్తులను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. పరిపాలన ప్రజలకు దగ్గరగా ఉండాలి తప్ప.. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం జిల్లాలు ఉండకూడదని ప్రభుత్వం యోచిస్తోంది. పార్లమెంట్ నియోజకవర్గాల ప్రాతిపదికన లేదా అసెంబ్లీ నియోజకవర్గాలను విభజించకుండా జిల్లాల పునర్నిర్మాణం జరగాలని నిపుణులు సూచిస్తున్నారు. మొత్తానికి.. రాష్టంలో కొత్త జిల్లాల ఏర్పాటు లేదా పాత జిల్లాల విలీనంపై ప్రభుత్వం అధికారిక కమిటీ వేసిన తర్వాతే పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# తెలంగాణ ఉద్యోగులకు సంక్రాంతి కానుక..



తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం ( డీఏ) మంజూరు చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. సచివాలయంలో ఉద్యోగ సంఘాల డైరీని ఆవిష్కరించిన సందర్భంగా ఆయన ఈ ప్రకటన చేశారు. ఈ డీఏ పెంపు వల్ల ప్రభుత్వంపై నెలకు రూ. 227 కోట్ల అదనపు భారం పడినప్పటికీ.. ఉద్యోగుల సంక్షేమం దృష్ట్యా ఈ ఫైలుపై సంతకం చేసినట్లు సీఎం తెలిపారు. అలాగే ఉద్యోగులకు రూ. కోటి ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం అశాస్త్రీయంగా చేసిన జిల్లాల విభజనను సవరించేందుకు రిటైర్డ్ అధికారులతో కమిటీ వేస్తామని, ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు చెల్లిస్తూ ఉద్యోగులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం (డీఏ) మంజూరు చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. సచివాలయంలో ఉద్యోగ సంఘాల డైరీని ఆవిష్కరించిన సందర్భంగా ఆయన ఈ ప్రకటన చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. చాలా కాలంగా ఎదురుచూస్తున్న కరువు భత్యం(డీఏ) ఫైలుపై సంతకం చేసినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వ ఖజానాపై ప్రతి నెలా రూ. 227 కోట్ల అదనపు భారం పడనుందని ఆయన పేర్కొన్నారు. అయినప్పటికీ.. ఉద్యోగుల మోహంలో చిరునవ్వు చూడాలనే ఉద్దేశంతోనే ఈ అడుగు వేసినట్లు చెప్పారు.గత ప్రభుత్వ హయాంలో జీతాల కోసం నెలంతా వేచి చూడాల్సి వచ్చేదని, కానీ ఇప్పుడు ప్రతి నెలా 1వ తేదీనే ఉద్యోగుల ఖాతాల్లో వేతనాలు జమ చేస్తున్నామని ఆయన గుర్తు చేశారు. ఉద్యోగుల కుటుంబాలకు రక్షణగా రూ. 1 కోటి ప్రమాద బీమా సౌకర్యాన్ని కూడా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఉద్యోగులే కీలకమని.. రాష్ట్ర అభివృద్ధిలో వారు భాగస్వాములు కావాలని కోరారు. పాలనాపరమైన సవాళ్లు మరియు జిల్లాల పునర్వ్యవస్థీకరణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, గత ప్రభుత్వ తీరుపై ముఖ్యమంత్రి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత పాలకులు రూ. 1.11 లక్షల కోట్ల బకాయిలు పెట్టి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఈ అప్పులకు వడ్డీలు చెల్లిస్తూనే ప్రజలకు.. రైతులకు మరియు ఉద్యోగులకు మేలు చేసేందుకు కష్టపడుతున్నామని వివరించారు. ఫామ్‌హౌస్‌లో ఉంటూ కొందరు ప్రభుత్వంపై కుట్రలు చేస్తున్నారని.. అభివృద్ధి పనులకు అడ్డంకులు సృష్టిస్తున్నారని పరోక్షంగా కేసీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. యజ్ఞాలను అడ్డుకునే మారీచుల వలె కొందరు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.గతంలో అశాస్త్రీయంగా జరిగిన జిల్లాల విభజనపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. కేవలం నాలుగు లేదా ఐదు మండలాలతో జిల్లాలు ఏర్పాటు చేయడం వల్ల పాలనాపరమైన సమస్యలు వస్తున్నాయని గుర్తించామన్నారు. దీనిపై రిటైర్డ్ అధికారులతో ఒక ఉన్నత స్థాయి కమిటీని వేసి, ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని జిల్లాల సరిహద్దులను శాస్త్రీయంగా సవరించనున్నట్లు సీఎం స్పష్టం చేశారు. ఉద్యోగుల సమస్యలన్నింటినీ దశలవారీగా పరిష్కరిస్తామని.. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.



# సచిన్ తర్వాత కింగ్ దే ఆ స్థానం!!

## 28 వేల పరుగులతో ...



వడోదరా వేదికగా న్యూజిలాండ్‌తో వన్డేలో విరాట్ కోహ్లి మరో అరుదైన ఘనత సాధించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో సంగక్కరను దాటేసి రెండో స్థానానికి ఎగబాకాడు. అంతేకాదు, 28 వేల పరుగులు అత్యంత వేగంగా పూర్తి చేసిన ఆటగాడిగానూ చరిత్ర సృష్టించాడు. ఈ సిరీస్‌లో మరిన్ని రికార్డులు బద్దలు కొట్టే అవకాశం ఉంది. తొలి వన్డేలో 93 పరుగులు చేసిన కోహ్లి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకున్నాడు. న్యూజిలాండ్‌తో వడోదర వేదికగా జరిగిన తొలి వన్డేలో విరాట్ కోహ్లి మరో చారిత్రక ఘనత సాధించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాళ్ల జాబితాలో విరాట్ కోహ్లి రెండో స్థానానికి ఎగబాకాడు. ఈ క్రమంలో శ్రీలంక దిగ్గజం కుమార్ సంగక్కర రికార్డును దాటేసి, సచిన్ టెండూల్కర్ తర్వాతి స్థానంలో నిలిచాడు. మ్యాచ్ ప్రారంభానికి ముందు సంగక్కర కెరీర్ పరుగుల సంఖ్య 28,016 కాగా, కోహ్లి కేవలం 42 పరుగుల దూరంలో ఉన్నాడు. భారత జట్టు ఛేజింగ్‌లో 19వ ఓవర్‌లో ఈ మైలురాయిని చేరుకున్న కోహ్లి.. 28,000 అంతర్జాతీయ పరుగులు పూర్తి చేసిన రెండో భారత ఆటగాడిగా రికార్డులకెక్కాడు.అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా సచిన్ టెండూల్కర్ మొదటి స్థానంలో ఉండగా.. ఆ తర్వాత విరాట్ కోహ్లినే. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్లను ఒకసారి పరిశీలిస్తే.. సచిన్ టెండూల్కర్ 34,357 పరుగులు, విరాట్ కోహ్లి 28,017ం పరుగులు, కుమార్ సంగక్కర (శ్రీలంక) 28,016 పరుగులు, రికీ పాంటింగ్ (ఆస్ట్రేలియా) 27,483, మహేళ జయవర్ధనే (శ్రీలంక) 25,957, జాక్వెస్ కాలిస్ (దక్షిణాఫ్రికా) 25,534.ఇదే కాదు కోహ్లి మరో రికార్డును కూడా తన ఖాతాలో వేసుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో 28 వేల పరుగులు వేగంగా పూర్తి చేసిన ఆటగాడిగా కొత్త చరిత్ర సృష్టించాడు. ఈ ఘనతను కోహ్లి కేవలం 624 ఇన్నింగ్స్‌ల్లోనే సాధించగా, గత రికార్డు సచిన్ టెండూల్కర్ పేరు మీద 644 ఇన్నింగ్స్‌లతో ఉంది. అత్యంత తక్కువ ఇన్నింగ్స్‌లలో 28వేల పరుగులను పూర్తి చేసిన ఆటగాళ్లలో కోహ్లి టాప్ ప్లేస్‌లో నిలిచాడు. విరాట్ కోహ్లి 624 ఇన్నింగ్స్ ఇన్నింగ్స్‌లలో ఈ ఘనతను సాధిస్తే.. సచిన్ టెండూల్కర్ 644 ఇన్నింగ్స్, కుమార్ సంగక్కర 666 ఇన్నింగ్స్‌లలో ఈ మైలురాయిని అందుకున్నారు.సంగక్కరను వెనక్కి నెట్టి ముందుకు దూసుకెళ్లిన కోహ్లి, ఈ మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో మరిన్ని రికార్డులపై కన్నేశాడు. న్యూజిలాండ్‌పై వన్డేల్లో అత్యధిక పరుగులు సాధించిన భారత ఆటగాడిగా సచిన్ 1,750 పరుగుల రికార్డును ఛేదించడమే కాకుండా, 15,000 వన్డే పరుగుల మైలురాయి వైపు వేగంగా అడుగులు వేస్తున్నాడు.ఇక మ్యాచ్ విషయానికి వస్తే న్యూజిలాండ్ 50 ఓవర్లలో 300 పరుగులు చేసింది. డారిల్ మిచెల్ 84 పరుగులతో జట్టును ఆదుకున్నాడు. అయితే భారత్ ఛేజింగ్‌లో కోహ్లి – శుభ్‌మన్ గిల్ జోడీ కీలక భాగస్వామ్యంతో జట్టును ముందుకు నడిపించింది. కోహ్లి 93 పరుగులు చేసి సెంచరీని మిస్ చేసుకున్నాడు. ఆఖర్లో హర్షిత్ రాణా బౌండరీలు బాదగా, కేఎల్ రాహుల్ ఫినిషింగ్ టచ్‌తో మ్యాచ్‌ని గెలిపించాడు.




## కాసేపు హీటెక్కిన గ్రౌండ్!



భారత్ – న్యూజిలాండ్ తొలి వన్డేలో హర్షిత్ రాణా, డారెల్ మిచెల్ మధ్య మాటల యుద్ధం జరిగింది. బౌన్సర్ ను మిస్ అయిన మిచెల్, స్టీవ్ స్మిత్ లా నటించడంతో ప్రేక్షకులు నవ్వారు. ఆల్ రౌండర్ గా రాణించిన రాణా, బ్యాటింగ్ లోనూ కీలక పాత్ర పోషించి భారత్ విజయంలో తోడ్పడ్డాడు. కివీస్ 300 చేస్తే, భారత్ 301 లక్ష్యాన్ని ఛేదించింది. విరాట్ కోహ్లి 93 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. భారత్ – న్యూజిలాండ్ తొలి వన్డేలో హీటెడ్ మూమెంట్ చోటుచేసుకుంది. వడోదరా వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టీమిండియా పేస్ ఆల్‌రౌండర్ హర్షిత్ రాణా , న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్ డారెల్ మిచెల్ మధ్య కాస్తంత ఉద్రిక్త పరిస్థితి చోటుచేసుకుంది. ఇద్దరి మధ్య మాటల యుద్ధం కూడా జరిగింది.. కానీ అంపైర్లు వచ్చి జోక్యం చేసుకునేంత లేకపోవడంతో కూల్‌గా ముగిసింది. అయితే మ్యాచ్ మొత్తానికి ఈ ఇన్సిడెంట్ ప్రేక్షకుల దృష్టిని బాగా ఆకట్టుకుంది. న్యూజిలాండ్ ఇన్నింగ్స్ 43వ ఓవర్‌లో ఈ సంఘటన జరిగింది. హర్షిత్ రాణా వేసిన ఆ ఓవర్ తొలి బంతిని మిచెల్ ఆఫ్ సైడ్‌లో డ్రైవ్ చేసి సింగిల్‌కు పరిగెత్తాడు. అదే సమయంలో తన ఫాలో త్రూలో కదులుతున్న హర్షిత్ రాణాను మిచెల్ ఢీకొన్నాడు. అయితే ఎవ్వరికీ ఏం కాకపోయినా.. ఇద్దరి మధ్య కాస్తంత హీటెడ్ మూమెంట్ వచ్చింది. మిచెల్ వెనక్కి తిరిగి రాణా వైపు కోపంగా చూడగా, రాణా కూడా అక్కడే ఆగి ఫేస్ టు ఫేస్ కోపంగా చూసుకున్నారు. అంపైర్లు జోక్యం చేసుకుందాము అనుకునేలోపే ఎవ్వరి ఎండ్‌కు వాళ్లు వెళ్లిపోయారు. అయితే అదే ఓవర్‌లో హర్షిత్ వేసిన ఓ బౌన్సర్‌ను అప్పర్ కట్ ఆడే ప్రయత్నం చేయగా, అది మిస్సయింది.. దాంతో అంపైర్ వైడ్‌గా ప్రకటించాడు. అయితే, మిచెల్ తన కుడి చేతి గ్లోవ్‌తో షాట్ ఆడుతున్నట్లు నటించాడు. అచ్చం స్టీవ్ స్మిత్ ప్రవర్తించినట్టే ప్రవర్తించడంతో గ్రౌండ్‌లో ఒక్కసారిగా ప్రేక్షకులు నవ్వారు. ఇక ఈ మ్యాచ్‌లో అర్ష్‌దీప్ స్థానంలో జట్టులోకి వచ్చిన హర్షిత్ రాణా ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టాడు. అటు బౌలింగ్, ఇటు బ్యాటింగ్‌తో తనదైన శైలిలో ఆకట్టుకున్నాడు. 20 ఓవర్ల వరకూ వికెట్ పడకుండా ఆడిన కివీస్ ఓపెనర్లు ఇద్దర్నీ ఔట్ చేసి టీమిండియాకు బ్రేక్ ఇచ్చిన రాణా.. బ్యాటింగ్‌లో కూడా వరుస వికెట్లు పడిన తర్వాత క్రీజులోకి వచ్చి గేమ్ ఛేంజింగ్ ఇన్నింగ్స్‌తో టీమిండియా విజయంలో కీలకపాత్ర పోషించాడు.తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 300 పరుగులు చేయగా.. డారెల్ మిచెల్ 84 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. 301 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 49 ఓవర్లలో విజయం సాధించింది. విరాట్ కోహ్లి 93, శుభమన్ గిల్ 56, శ్రేయాస్ అయ్యర్ 49 పరుగులతో రాణించారు.



## వెస్టిండీస్ లెజెండ్ రికార్డ్ బ్రేక్



భారత ఓపెనర్ రోహిత్ శర్మ వన్డేల్లో సరికొత్త రికార్డు నెలకొల్పాడు. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓపెనర్‌గా అత్యధిక సిక్సర్లు కొట్టిన ఆటగాడిగా క్రిస్ గేల్ రికార్డును అధిగమించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో 650 సిక్సర్లు పూర్తి చేసిన తొలి ఆటగాడిగానూ నిలిచాడు. ఈ అద్భుత ప్రదర్శనతో టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఇన్నింగ్స్‌ను అద్భుతంగా ఆరంభించిన రోహిత్ శర్మ భారీ స్కోర్ చేయలేకపోయాడు. 29 బంతుల్లో 26 పరుగులు చేసి అవుటయ్యాడు. భారత స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ మరో అరుదైన రికార్డును అందుకున్నాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్ తొలి మ్యాచ్‌లో రోహిత్ ఈ ఘనత సాధించాడు. వడోదరలోని బరోడా క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో వన్డే క్రికెట్‌లో ఓపెనర్‌గా అత్యధిక సిక్సర్లు కొట్టిన ఆటగాడిగా రోహిత్ చరిత్ర సృష్టించాడు. 301 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు భారత ఇన్నింగ్స్‌ను కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి రోహిత్ ప్రారంభించాడు. ఆరంభంలో కాస్త నెమ్మదిగా ఆడిన రోహిత్, ఆరో ఓవర్‌లో బెన్ ఫౌల్క్స్ బౌలింగ్‌లో తొలి సిక్సర్ బాదాడు. ఆ తర్వాతి ఓవర్‌లో కైల్ జేమిసన్ వేసిన బ్యాక్ ఆఫ్ లెంగ్త్ బంతిని స్టాండ్స్‌లోకి పంపి మరో భారీ షాట్ కొట్టాడు. ఈ సిక్సర్‌తో రోహిత్ శర్మ అంతర్జాతీయ క్రికెట్‌లో 650 సిక్సర్లు పూర్తి చేసిన తొలి ఆటగాడిగా కూడా నిలిచాడు. ఇది మరో చారిత్రక ఘట్టం కావడం విశేషం. అయితే మంచి ఆరంభాన్ని పెద్ద ఇన్నింగ్స్‌గా మార్చుకోలేకపోయిన రోహిత్, తొమ్మిదో ఓవర్‌లో జేమిసన్ బౌలింగ్‌లో ఔట్ అయ్యాడు. 29 బంతుల్లో 26 పరుగులు చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లో మూడు ఫోర్లు, రెండు సిక్సర్లు ఉన్నాయి.ఈ మ్యాచ్‌తో వన్డేల్లో ఓపెనర్‌గా రోహిత్ శర్మ సిక్సర్ల సంఖ్య 329కి చేరింది. దీంతో వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్ 328 సిక్సర్ల రికార్డును రోహిత్ అధిగమించాడు. ఇప్పటికే గతేడాది దక్షిణాఫ్రికా సిరీస్‌లో షాహిద్ అఫ్రిదీ పేరిట ఉన్న వన్డేల్లో అత్యధిక సిక్సర్ల రికార్డును కూడా రోహిత్ బద్దలు కొట్టిన విషయం తెలిసిందే. గత ఏడాది కూడా రోహిత్ అద్భుత ఫామ్‌లో కొనసాగాడు. 14 వన్డే మ్యాచ్‌ల్లో 650 పరుగులు చేసి, ఒకసారి నాటౌట్‌గా నిలిచాడు. గతేడాది అత్యుత్తమ స్కోర్ 121. ప్రస్తుతం ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు.ఇక మ్యాచ్ విషయానికి వస్తే వడోదరా వన్డేలో టాస్ గెలిచిన టీమిండియా కెప్టెన్ శుభమన్ గిల్ బౌలింగ్ ఎంచుకున్నాడు. తొలుత బ్యాటింగ్‌కి వచ్చిన న్యూజిలాండ్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 300 పరుగులు చేసింది. విరాట్ కోహ్లి 93 పరుగులతో పాటు గిల్, అయ్యర్ రాణించడంతో టీమిండియా 49 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి విజయం సాధించింది.

## 12 ఓవర్లలోనే 160 రన్స్



టీ 20 వరల్డ్ కప్ ముందు పాక్ బౌలర్ల పరువు గంగలో కలిసిపోయింది. శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో భారీగా పరుగులు సమర్పించుకుని, 14 పరుగుల తేడాతో ఓటమి పాలయ్యారు. వర్షం కారణంగా 12 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో శ్రీలంక బ్యాటర్లు, ముఖ్యంగా కెప్టెన్ శానక రెచ్చిపోయాడు. పాక్ బౌలర్లు తేలిపోవడంతో, వరల్డ్ కప్ జట్టులో ఉన్నవారి ప్రదర్శనపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ మ్యాచ్‌లో శ్రీలంక జట్టు 14 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026 ప్రారంభానికి ముందు పాకిస్తాన్ ప్రీమియమ్ పేస్ బౌలర్ల పరువు పోయింది. శ్రీలంకతో జరిగిన టీ20 మ్యాచ్‌లో భారీగా పరుగులు సమర్పించుకున్నారు. ఈ మ్యాచ్‌లో ఆడిన అందరు బౌలర్లు రేపు జరిగే టీ 20 వరల్డ్ కప్ జట్టులో ఉన్నవాళ్లే కావడం గమనార్హం. రాంగిరి దంబుల్లా అంతర్జాతీయ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో శ్రీలంక జట్టు 14 పరుగుల తేడాతో విజయం సాధించింది. శ్రీలంక – పాకిస్తాన్ టీ 20 సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగిన ఆఖరి మ్యాచ్ రసవత్తరంగా సాగింది. వర్షం కారణంగా 12 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో శ్రీలంక బ్యాటర్లు రెచ్చిపోయి ఆడారు. టాస్ గెలిచిన పాకిస్తాన్ జట్టు శ్రీలంకను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. పిచ్ తడిగా ఉండటంతో పాకిస్తాన్ బౌలర్లు ఈ మ్యాచ్‌లో తేలిపోయారు. ఓపెనర్ పాతుమ్ నిస్సాంక డకౌట్ కాగా, మరో ఓపెనర్ కమిల్ మిశారా 8 బంతుల్లో 20 పరుగులు బాది అద్భుత ఆరంభం ఇచ్చాడు. ఇదే జోష్‌ని కొనసాగించిన మిగతా బ్యాటర్లు కూడా హిట్టింగ్‌కే ప్రాధాన్యత ఇచ్చి స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు. కుశాల్ మెండిస్ 16 బంతుల్లో 30, ధనుంజయ డిసెల్వ 22, చరిత అసలం 21 పరుగులు నమోదు చేశారు.ఇక ఆఖర్లో కెప్టెన్ దాసున్ శానక 9 బంతుల్లో 5 సిక్సర్లతో 34 పరుగులు బాది స్కోర్ బోర్డుని పరుగులు పెట్టించాడు. జనిత్ లియనగే 8 బంతుల్లో 22 పరుగులు బాదడంతో శ్రీలంక జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసింది. పాకిస్తాన్ బౌలర్లలో మొహమ్మద్ వసీజ్ జూనియర్ 3 ఓవర్లలో 54 పరుగులు సమర్పించుకుని 3 వికెట్లు తీసుకున్నాడు. 161 పరుగులతో బరిలోకి దిగిన పాకిస్తాన్ జట్టు కూడా పోటీ ఇచ్చింది. ఓపెనర్లు విఫలమయినప్పటికీ కెప్టెన్ సల్మాన్ అఘా హిట్టింగ్‌తో మ్యాచ్‌ని నిలబెట్టాడు. 12 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 45 పరుగులు చేసి అవుటయ్యాడు. మొహమ్మద్ నవాజ్ 28, ఖవాజా నఫాయ్ 26 పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే అవుటవ్వడంతో పాకిస్తాన్ 12 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 146 పరుగులు మాత్రమే చేయగలిగింది. దాంతో శ్రీలంక 14 పరుగుల తేడాతో విజయం సాధించింది.శ్రీలంక బౌలర్లలో వానిందు హసరంగ 3 ఓవర్లలో 4 వికెట్లు తీసుకుని 35 పరుగులు ఇవ్వగా, మతీషా పతిరణా 2 వికెట్లు తీసుకున్నాడు. నాలుగు వికెట్లు తీసుకున్న హసరంగకి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. మొత్తం మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో పాకిస్తాన్ విజయం సాధించగా, రెండో మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. డిసైడర్ మ్యాచ్‌లో శ్రీలంక విజయం సాధించి సిరీస్‌ను సమం చేసింది.




# శంకర వరప్రసాద్ గారి సక్సెస్ సెలబ్రేషన్స్..



చిరంజీవి హీరోగా నటించిన 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా ప్రీమియర్ షోలతోనే సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకుంది. వింటేజ్ చిరంజీవి మేనరిజమ్స్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. బాస్ ఈజ్ బ్యాక్ అంటూ మెగా ఫ్యాన్స్ పండగ చేసుకుంటున్నారు. దీంతో డైరెక్టర్ అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటి అర్ధరాత్రి చిరు ఇంటికి వెళ్లి సక్సెస్ సెలబ్రేషన్స్ చేసుకున్నారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్న ఈ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మన శంకర వరప్రసాద్ గారు సంక్రాంతి పండక్కి వచ్చేశారు.. ప్రీమియర్స్ తోనే థియేటర్లలో పండగ వాతావరణం తీసుకొచ్చారు. మెగాస్టార్ చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ నేడు ప్రపంచ వ్యాప్తంగా విడుదలైంది. ఆదివారం రాత్రి ప్రదర్శించిన ప్రీమియర్ షోల నుంచే ఈ చిత్రానికి హిట్ టాక్ వచ్చింది. చాలా రోజుల తర్వాత వింటేజ్ బాస్ ను చూశామంటూ మెగా ఫ్యాన్స్ సంబరాలు చేసుకుంటున్నారు. ఈ రెస్పాన్స్ చూసి చిరు సైతం ఖుషీగా ఉన్నారు.రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆదివారం రాత్రి 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా ప్రీమియర్ షోలు పడ్డాయి. వీటికి ప్రేక్షకుల నుంచి అనూహ్య స్పందన లభించింది. ప్రీమియర్స్ పూర్తవ్వగానే అర్ధరాత్రి చిత్ర బృందం సక్సెస్ సెలబ్రేషన్స్ చేసుకుంది. శ్రీరాములు థియేటర్ లో షో చూసిన డైరెక్టర్ అనిల్ రావిపూడి.. నిర్మాత సాహు గారపాటితో కలిసి నేరుగా చిరంజీవి ఇంటికి వెళ్లారు. ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. చిరు, అనిల్ రావిపూడి, సాహు, సుస్మిత కొణిదెల కలిసి ఒకరికొకరు స్వీట్స్ తినిపించుకున్నారు. 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా సక్సెస్ సెలబ్రేషన్స్ ఫోటోలను నిర్మాణ సంస్థ సోషల్ మీడియాలో పంచుకుంది. ఇందులో చిరంజీవి – అనిల్ రావిపూడి ఎంతో సంతోషంగా కనిపిస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.





# రూ.200 కోట్లు లోడింగ్!




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన ది రాజా సాబ్ బాక్సాఫీస్ వద్ద దూకుడు కొనసాగిస్తోంది. విడుదలైన తొలి రోజే రూ.112 కోట్లకు పైగా గ్రాస్ సాధించిన ఈ చిత్రం, మూడో రోజుకు ప్రపంచవ్యాప్తంగా రూ.183 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు మేకర్స్ ప్రకటించారు. A festival treat turned BOX OFFICE CARNAGE అంటూ People Media Factory షేర్ చేసిన ట్వీట్ వైరల్‌గా మారింది. టాక్ మిక్స్‌డ్‌గా ఉన్నప్పటికీ థియేటర్ రెస్పాన్స్ బలంగా కొనసాగుతోందిపాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన ' ది రాజా సాబ్ ' బాక్సాఫీస్ వద్ద దూకుడు కొనసాగిస్తోంది. విడుదలైనప్పటి నుంచి థియేటర్లలో సూపర్ రెస్పాన్స్‌తో సందడి చేస్తున్న ఈ సినిమా, టాక్ మిక్స్‌డ్‌గా ఉన్నప్పటికీ కలెక్షన్ల పరంగా అంచనాలను మించిపోయింది. దర్శకుడు మారుతి తెరకెక్కించిన హారర్‌ఉకామెడీ ఫాంటసీ జానర్‌లో ప్రభాస్‌ను ఫుల్ ఎంటర్‌టైనర్ మోడ్‌లో చూడటం అభిమానులకు పండగలా మారింది. ప్రభాస్ సినిమా విడుదలవుతుందంటే అది అభిమానులకు మాత్రమే కాదు, ట్రేడ్ వర్గాలకు, సాధారణ ప్రేక్షకులకు కూడా పండగలాంటిదే. ముఖ్యంగా 'కల్కి 2898 ADవంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ప్రభాస్ నుంచి వచ్చిన సినిమా కావడంతో 'ది రాజా సాబ్'పై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. దర్శకుడు మారుతి హారర్‌ఉకామెడీ జోనర్‌లో ప్రభాస్‌ను ఎలా ప్రెజెంట్ చేస్తాడన్న ఆసక్తి కూడా సినిమాపై హైప్‌ను భారీగా పెంచింది. ముఖ్యంగా ప్రభాస్ స్క్రీన్ ప్రెజెన్స్, కామెడీ టైమింగ్, మాస్ ఎలివేషన్స్ అభిమానులను ఆకట్టుకున్నాయి. ట్రేడ్ వర్గాల అంచనాలను తలకిందులు చేస్తూ ఈ చిత్రం ఫస్ట్ డే ప్రపంచవ్యాప్తంగా రూ.112 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ప్రకటించింది.KING SIZE BOX OFFICE DOMINATION అంటూ మేకర్స్ షేర్ చేసిన పోస్టులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. హారర్ ఫాంటసీ జానర్‌లో తొలి రోజే ఇంత భారీ ఓపెనింగ్స్ సాధించడం ఇదే తొలిసారి అని, ఈ కేటగిరీలో 'ది రాజా సాబ్' కొత్త రికార్డు సృష్టించిందని వారు వెల్లడించారు. అయితే ఫస్ట్ డే తర్వాత మూవీ కలెక్షన్లు భారీగా పడిపోయిన్లు వార్తలొచ్చినా అవన్నీ నిజం కాదని తాజా లెక్కలు నిరూపిస్తున్నాయి. తాజాగా మేకర్స్ మూడు రోజుల కలెక్షన్లను కూడా అధికారికంగా ప్రకటించారు.A festival treat turned BOX OFFICE CARNAGE అంటూ చేసిన ట్వీట్ ఇప్పుడు ట్రేడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. మూడు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.183 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు మేకర్స్ వెల్లడించారు. సంక్రాంతి పండగ వారం మొదలవుతున్న తరుణంలో ప్రేక్షకుల నుంచి భారీ ఆదరణ లభిస్తోందని కూడా వారు పేర్కొన్నారు. మూడు రోజుల్లోనే ఈ స్థాయి కలెక్షన్లు నమోదు కావడంతో, నాలుగో రోజు సినిమాకు మరింత ఊపు వచ్చే అవకాశం ఉందని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. పండగ సెలవులు, ఫ్యాన్స్ హంగామా కొనసాగుతున్న నేపథ్యంలో 'ది రాజా సాబ్' నాలుగో రోజే రూ.200 కోట్ల క్లబ్‌లోకి ఎంటర్ అయ్యే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. టాక్ ఎలా ఉన్నా ప్రభాస్ మార్కెట్ పవర్ ముందు బాక్సాఫీస్ లెక్కలు మరోసారి తలవంచాల్సి వచ్చిందని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# శ్రీలీలకి కలిసిరాని కోలీవుడ్!'పరాశక్తి' కూడా కాపాడలేకపోయిందిగా..




శ్రీలీలకి కలిసిరాని కోలీవుడ్!'పరాశక్తి' కూడా కాపాడలేకపోపొంగల్ సీజన్‌లో కోలీవుడ్‌లో భారీ అంచనాల మధ్య విడుదలైన పరాశక్తి సినిమా మొదటి షో నుంచే మిక్స్‌డ్ టాక్‌ను అందుకుంది. శివకార్తికేయన్ హీరోగా, సుధా కొంగర దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో విలన్‌గా రవి మోహన్, కీలక పాత్రలో అథర్వ కనిపించారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించిన శ్రీలీలకు ఇది కోలీవుడ్‌లో తొలి సినిమా కావడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే కథలో నిజాయితీ ఉన్నప్పటికీ, కథనం బలహీనంగా ఉండటం, స్క్రీన్‌ప్లే లోపాలు కనిపించడం వల్ల సినిమా ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయిందనే అభిప్రాయం వినిపిస్తోంది. దీంతో 'జన నాయగన్' వాయిదాతో ఏర్పడిన స్పేస్‌ని ఈ మూవీ ఫిల్ చేయలేకపోయింది.యిందిగా..పొంగల్ సీజన్‌లో కోలీవుడ్‌లో భారీ అంచనాల మధ్య విడుదలైన పరాశక్తి సినిమా మొదటి షో నుంచే మిక్స్‌డ్ టాక్‌ను అందుకుంది. శివకార్తికేయన్ హీరోగా, సుధా కొంగర దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో విలన్‌గా రవి మోహన్, కీలక పాత్రలో అథర్వ కనిపించారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించిన శ్రీలీలకు ఇది కోలీవుడ్‌లో తొలి సినిమా కావడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే కథలో నిజాయితీ ఉన్నప్పటికీ, కథనం బలహీనంగా ఉండటం, స్క్రీన్‌ప్లే లోపాలు కనిపించడం వల్ల సినిమా ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయిందనే అభిప్రాయం వినిపిస్తోంది. దీంతో 'జన నాయగన్' వాయిదాతో ఏర్పడిన స్పేస్‌ని ఈ మూవీ ఫిల్ చేయలేకపోయింది. ఇక శ్రీలీల కెరీర్‌ను పరిశీలిస్తే అందం ఉన్నా అదృష్టం కలిసి రాకపోవడం స్పష్టంగా కనిపిస్తుంది. తొలి సినిమా విడుదల కాకముందే వరుస అవకాశాలు దక్కించుకున్న హీరోయిన్‌గా ఆమెకు ప్రత్యేక గుర్తింపు ఉంది. స్టార్ హీరోలు, యంగ్ హీరోలు అన్న తేడా లేకుండా అందరితో నటించినప్పటికీ, 'ధమాకా', 'గుంటూరు కారం' తర్వాత ఆమె చేసిన సినిమాలన్నీ వరుసగా పరాజయాల పాలవ్వడం అభిమానులను నిరాశపరుస్తోంది. "ఇదే బ్రేక్ అవుతుంది" అనే ఆశా "ఇదీ కాదా?" అనే నిరాశగా మారడం ఇప్పుడు శ్రీలీల కెరీర్‌కు సాధారణంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. టాలీవుడ్‌లో వరుస ఫ్లాపుల తర్వాత, కోలీవుడ్‌లో అదృష్టం పరీక్షించుకోవాలని శ్రీలీల చేసిన ప్రయత్నమే 'పరాశక్తి'. సుధా కొంగర లాంటి కంటెంట్ ఓరియెంటెడ్ దర్శకురాలి సినిమాలో అవకాశం రావడంతో, ఈ సినిమా తన కెరీర్‌ను మలుపు తిప్పుతుందనే నమ్మకం ఆమెతో పాటు అభిమానుల్లోనూ ఉంది. ఈ పాత్ర కోసం లుక్‌ను పూర్తిగా మార్చుకోవడం, యాక్టింగ్‌పై మరింత ఫోకస్ పెట్టడం వంటి ప్రయత్నాలు చేసినా ఫలితం మాత్రం ఆశించినట్లుగా రాలేదని టాక్. ముఖ్యంగా సుధా కొంగర సినిమాల్లో హీరోయిన్లు చాలా పవర్‌ఫుల్‌గా కనిపిస్తారనే పేరు ఉండగా 'రత్నమాల' పాత్రలో శ్రీలీల అంత ప్రభావం చూపలేకపోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో కోలీవుడ్‌లో స్టార్‌డమ్ సంపాదించాలన్న శ్రీలీల ఆశలకు తొలి అడుగులోనే ఎదురుదెబ్బ తగిలినట్లయిందని విశ్లేషకులు భావిస్తున్నారు. వరుస ఫ్లాపుల కారణంగా తెలుగులో ఆఫర్లు తగ్గడం, ఇప్పుడు తమిళంలోనూ తొలి ప్రయత్నమే నిరాశపరచడం ఆమె కెరీర్ గ్రాఫ్‌పై ప్రభావం చూపుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ప్రాజెక్ట్ ఎంపికలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆమె నిర్ణయించుకున్నట్లు సమాచార

# ఓటీటీలోకి వచ్చేసిన 'అఖండ 2



ఓటీటీలోకి వచ్చేసిన 'అఖండ 2'అఖండ 2: తాండవం' సినిమా డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ సొంతం భారీ రేటుకి సొంతం చేసుకుంది. థియేటర్లలో బాలయ్య సందడి ముగిసిన తర్వాత, ఈ చిత్రం డిజిటల్ స్ట్రీమింగ్ కోసం నందమూరి ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూశారు. ఈ నేపథ్యంలో సంక్రాంతి కానుకగా జనవరి 9 నుంచి ఓటీటీలో అందుబాటులోకి తీసుకొచ్చారు. తెలుగుతో పాటు హిందీ, తమిళ్, కన్నడ, మలయాళ భాషల్లో ఈ స్ట్రీమింగ్ అవుతోంది.

# బ్లాక్‌బస్టర్ ఫ్రాంచైజీలోకి గ్రీక్ గాడ్





కొత్త ఏడాదిలో ప్రేక్షకులకు కొత్త 'డాన్' పరిచయం కాబోతున్నాడా? అంటే అవుననే అంటున్నాయి బాలీవుడ్ సినీవర్గాలు. బాలీవుడ్‌లో సక్సెస్‌ఫుల్ ఫ్రాంచైజీల్లో ఒకటైన 'డాన్' మూడో భాగంలో రణ్‌వీర్ సింగ్ నటించనున్నాడని వార్తలు రాగా.. కొద్దిరోజులకే ఆయన తప్పుకున్నట్లు ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో ఆయన స్థానంలో హృతిక్ రోషన్‌ను తీసుకోవాలన్న ఆలోచన మేకర్స్‌లో ఉన్నట్లు బీటౌన్‌లో జోరుగా చర్చ జరుగుతోంది. "రణ్‌వీర్ తప్పుకున్న తర్వాత ఆ పాత్రకు హృతిక్ మాత్రమే సరిగ్గా సరిపోతారని చిత్రబృందం భావిస్తోంది. చర్చలు ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నప్పటికీ త్వరలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది" అని హృతిక్‌కు సన్నిహితంగా ఉన్న వర్గాలు చెబుతున్నాయి.

Owned by Katikala Vara Prasad,Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Banka Indira . at D.no. 465 Le out no2. Dodleru Road. Ysr jagananna colony. Krosuru.Guntur AP. 522410. Editor. Katikala Vara Prasad.RNI APTEL/2015/62250. Ph:9849707349 email:kvp6858@gmail.com